● భోగి మంటల్లో కాంగ్రెస్ హామీ పత్రాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని రేవంత్‌రెడ్డి మోసపూరిత హామీల పత్రాలను భోగి మంటల్లో వేసి తగలబెట్టి బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన అంతా మోసమేనని, రేవంత్ హామీలన్నీ బోగసేనని ధ్వజమెత్తారు. -అశ్వారావుపేట

కులగణనతోనే రేషన్‌కార్డులు

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): కులగణన నివేదిక ఆధారంగానే ఆహార భద్రతా కార్డులను ప్రభుత్వం మంజూరు చేయనున్నది. కులగణన సర్వే జాబితాలోని నమోదు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, గ్రామసభలో ఆమోదం తీసుకున్న తర్వాతనే లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించింది. అర్హత గల కుటుంబాలకు ఈ నెల 26వ నుంచి కార్డులను మంజూరు చేయనున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆహారభద్రత కార్డుల మంజూరుకు పాటించాల్సిన విధివిధానాలను ఖరారు చేస్తూ మార్గదర్శకాలు వెల్లడించింది. తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు, పౌరసరఫరాలశాఖ అధికారులను ఆదేశించింది.

కార్డుల జారీకి విధివిధానాలు

- రేషన్‌కార్డులు లేని కుటుంబాల జాబితా క్షేత్రస్థాయి పరిశీలనకు కలెక్టర్లకు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పంపిస్తారు.
- మండలస్థాయిలో ఎంపీడీవో, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్(రెవెన్యూ), జిల్లా సివిల్ సప్లయ్ అధికారి పర్యవేక్షించనున్నారు.
- క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ముసాయిదా జాబితాను రూపొందించాలి. గ్రామసభ, వార్డుసభలో జాబితాను ప్రదర్శించి, చదివి వినిపించి చర్చిస్తారు.
- లబ్ధిదారుల అర్హత జాబితాను మండల, మున్సిపల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేసి కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ లాగిన్‌కు పంపాలి.
- జాబితాను కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ పరిశీలించి సంతృప్తి చెందితే సివిల్ సప్లయ్ కమిషనర్‌కు పంపాలి. ఆ తర్వాత సివిల్ సప్లయ్ కమిషనర్ కొత్త రేషన్‌కార్డులను జారీ చేస్తారు.
- అర్హత గల వ్యక్తి ఒకే చోట, ఒకే ఆహార భద్రత కార్డులో ఉండేలా ఉండాలి.
- కార్డులలో సభ్యుల మార్పులు, చేర్పులు, తొలగింపులు చేయాలి.
- కొత్త ఆహార భద్రత కార్డులను 26వ తేదీ నుంచి పంపిణీ చేస్తారు.

అర్హతలు

- గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం 1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలు మించనివారు.
- తరి 3.5 ఎకరాలు, మెట్ట భూమి 7.5ఎకరాలు, తరి, మెట్ట కలిపి 5ఎకరాలకు మించనివారు.
- ప్రభుత్వ, ప్రైవేట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాకూడదు.
- పెద్దపెద్ద వ్యాపారాలు ఉండకూడదు.
- ప్రభుత్వ పెన్షన్ తీసుకునేవారు.
- ఫోర్ వీలర్ (కారు) కలిగి ఉండకూడదు.
- ఆస్తులు, ఉన్నతమైన జీవనశైలిని పరిశీలించి కూడా రేషన్‌కార్డు ఇవ్వవచ్చునో? ఇవ్వకూడదో క్షేత్రస్థాయి తనిఖీ అధికారి విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చు.

పట్టణ పేదలకు భరోసా లేనట్టే?

- **మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల కూలీలకు మొండిచేయి**
- **ప్రత్యేక సర్వేతో గుర్తించాలని కార్మిక సంఘాల డిమాండ్**
- **రాష్ట్రవ్యాప్తంగా భారీగా దూరమవుతున్న పట్టణ కూలీలు**
- **ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే 12 వేల కుటుంబాలకు నష్టం**

నల్లగొండ ప్రతినిధి, జనవరి 13 (నమస్తే తెలంగాణ): భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ఏడాదికి 12,000 ప్రోత్సాహం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం కోతలు, కొర్రీల పేరుతో పథకానికి నీరుగార్చుతున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లబ్ధిదారులను ఉపాధి హామీ పథకంలో నమోదై, కనీసం 20 రోజులు పని చేసిన కూలీల నుంచి గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ పట్టణ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం వర్తించదు. కానీ కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో చాలా గ్రామాలు విలీనమయ్యాయి. ఇవి పేరుకు పట్టణాల పరిధిలో ఉన్నప్పటికీ అక్కడ ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు వీటిని పట్టణాలుగా గుర్తిస్తే కూలీలకు అన్యాయం జరుగుతుందని వ్యవసాయ, కార్మిక సంఘాల నేతలు చెప్తున్నారు. ప్రభుత్వం కొర్రీలు మానుకోవాలని కోరుతున్నారు.

ఉపాధి కార్డు లేకున్నా చేసేది కూలి పనే

బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనా సౌలభ్యం, మౌలిక సదుపాయాల కల్పన, సత్వర సేవల కోసం మున్సిపాలిటీలను పెంచింది. మున్సిపాలిటీ కేంద్రాలకు పరిసర గ్రామాలను విలీనం చేసింది. ఆయా గ్రామాల్లోని ప్రజల్లో భూమి ఉన్నవారు వ్యవసాయం చేసుకుంటుంటే.. భూమి లేనివారు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. గ్రామాలుగా ఉన్నప్పుడు ఉపాధి కార్డు ఉండేది. మున్సిపాలిటీల్లో కలవడం వల్ల కేంద్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం పథకం వర్తించదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి హామీ జాబ్ కార్డుకు లింక్ పెట్టి కొర్రీలు పెడుతున్నది.

ఇంతమందికి అన్యాయమా!

ప్రభుత్వ నిబంధనతో ఎంత నష్టం జరుగుతుందో చెప్పేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాను ఉదాహరణగా పరిశీలించవచ్చు. మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట, భువనగిరి, దేవరకొండ మున్సిపాలిటీల్లో కొన్ని గ్రామాలను విలీనం చేసి పరిధిని పెంచారు. నల్లగొండ మున్సిపాలిటీలో విలీనమైన మర్రిగూడెం, చర్లపల్లి, ఆర్జాలబావి, ఖతాల్‌గూడెం, కేశరాజుపల్లి, శేషమ్మగూడెంలోనే 3 వేల మందికిపైగా వ్యవసాయ కూలీలు ఉన్నట్టు అంచనా. హాలియా మున్సిపాలిటీలో అనుముల, ఇబ్రహీంపట్నంలో 500 మంది పథకానికి దూరమవుతున్నాయి. చిట్యాల మున్సిపాలిటీలో విలీనమైన శివనేనిగూడెంలోనూ ఇదే పరిస్థితి. కొత్తగా ఏర్పాటైన యాదగిరిగుట్ట, మోత్కూరు, ఆలేరు, చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, తిరుమలగిరి, హుజూర్‌నగర్, నేరడుచర్ల, నందికొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపాలిటీల్లోనూ గ్రామాలు విలీనమయ్యాయి.విలీన గ్రామాల్లోనే 12 వేల కుటుంబాలు పథకానికి దూరమవుతున్నాయని తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా కొత్త మున్సిపాలిటీల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ఈ గ్రామాల్లో ప్రత్యేక సర్వే చేసి అర్హులను గుర్తించాలని ఆయా గ్రామాల ప్రజలు, కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే పోరాటానికి సిద్ధమంటున్నారు.

10% మందికే ఆత్మీయ భరోసా

› మొదటిపేజీ తరువాయి...

సంగారెడ్డిలో ఎమ్మెల్యే ప్రభాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కార్డులు ఉండగా 1.02 కోట్ల మంది వ్యవసాయ కూలీలు పని చేస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇప్పుడు కోతలు పెట్టేందుకు సిద్ధమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సెంటు భూమి ఉన్నా, 20 రోజులు పనులకు పోకున్నా ఇందిరమ్మ భరోసా పథకం వర్తింపజేయబోమని ప్రభుత్వం నిబంధనలు పెడుతున్నదని హరీశ్ మండిపడ్డారు. ఐదు గుంటల భూమి ఉన్న వ్యవసాయ కూలీకి రైతుభరోసా కింద రూ.1500 వస్తే ఆత్మీయ భరోసా పథకం కింద రూ.10,500 నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. పది గుంటల భూమి ఉంటే రైతుభరోసా డబ్బు రూ.3 వేలు లభిస్తే ఆత్మీయ భరోసా పథకం కింద రూ.9 వేలు నష్టపోతారని తెలిపారు. 90 లక్షల మందికి ఆత్మీయభరోసా పథకం ఎగ్గొడుతున్నందుకు రేవంత్, భట్టి విక్రమార్క క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అందరికీ అమలు చేయకుంటే వ్యవసాయ కూలీలు తిరగబడతారని, పథకం అమలుకు గ్రామసభలు పెడితే అధికారులపైకి తిరగబడతారని హెచ్చరించారు. ఎకరం లోపు భూమి ఉన్నవారందరినీ వ్యవసాయ కూలీలకుగా గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

> **రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉన్నయి. 1.02 కోట్ల మంది వ్యవసాయ కూలీలు పనిచేస్తున్నరు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో కోతలు పెట్టేందుకు సిద్ధమైంది. సెంటు భూమి ఉన్నా, 20 రోజులు పనులకు పోకున్నా ఆత్మీయ భరోసా వర్తింపజేయబోమని నిబంధనలు పెడుతున్నది.**
> **-హరీశ్‌రావు**

గోబెల్స్‌ను మించిపోయిన భట్టి

అబద్ధాలు చెప్పడంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గోబెల్స్‌ను మించిపోతున్నారని హరీశ్ ఫైర్ అయ్యారు. మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కట్టలేదని, ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని భట్టి విక్రమార్క మాట్లాడటంపై హరీశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రాజెక్టులు, సాగునీటిపై బహిరంగ చర్చకు రావాలని భట్టికి సవాల్ విసిరారు. మదిర, ఖమ్మం, సెక్రటేరియట్, ప్రగతి భవన్ ఇలా ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని స్పష్టంచేశారు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే రూ.4 వేల కోట్లతో ప్రాజెక్టులు కట్టి 6.50 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చినట్టు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పదే పదే అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రూ.4.07 లక్షల కోట్లు అప్పు చేస్తే భట్టి విక్రమార్క రూ.6 లక్షల కోట్లు అని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిన ఆర్డీఎస్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసిందని, మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల్లో నీటి పరుగులు పెట్టించి 6.50 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చామని గుర్తుచేశారు. సాగునీటి విషయంలో తప్పుగా మాట్లాడిన భట్టి విక్రమార్క వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేదంటే తనతో బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

> **గిరిజన, దళిత, బీసీ కూలీల నోళ్లు కొట్టేందుకు రేవంత్, భట్టి విక్రమార్కకు చేతులెట్ల వస్తున్నయ్? 90 లక్షల మందికి ఆత్మీయ భరోసా పథకం ఎగ్గొడుతున్నరు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఎగ్గొడుతున్నందుకు రేవంత్, భట్టి విక్రమార్క క్షమాపణ చెప్పాలె. ఈ పథకం అందరికీ వర్తింపజేయకుంటే వ్యవసాయకూలీలు తిరగబడటం ఖాయం.. పథకంపై గ్రామసభలు పెడితే అధికారులపైకి వ్యవసాయ కూలీలు తిరగబడుతరు.**
> **-హరీశ్‌రావు**

రుణమాఫీ చెక్కుకు పతారా లేదు

సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ కోసం ఇచ్చిన రూ.2750 కోట్ల చెక్కుకు పతారా లేకుండా పోయిందని హరీశ్ ఎద్దేవా చేశారు. పంట రుణమాఫీ కోసం రేవంత్‌రెడ్డి రెండు నెలల క్రితం రూ.2750 కోట్ల చెక్కు ఇస్తే ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో డమ్మీ హామీలు ఇచ్చినట్టుగానే రేవంత్‌రెడ్డి డమ్మీ చెక్కు ఇచ్చారా? అని ప్రశ్నించారు. రైతులను అన్ని విధాలా ముఖ్యమంత్రి దగా చేస్తున్నారని మండిపడ్డారు. సంక్రాంతికి ఊళ్లకు వెళ్లిన అన్నలు, తమ్ముళ్లు, అక్కలు గ్రామాల్లో రైతులతో మాట్లాడాలని కోరారు. కేసీఆర్ పాలన ఎలా ఉన్నదో?, రేవంత్ పాలన ఎలా ఉన్నదో బహిరంగ చర్చ పెట్టాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జైపాల్‌రెడ్డి, మఠం భిక్షపతి, ఎం ఏ హకీం, విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

> **కేసీఆర్ హయాంలో మహబూబ్‌నగర్‌లో ఎన్ని ప్రాజెక్టులు నిర్మించామో.. ఎన్ని ఎకరాలకు నీళ్లిచ్చామో లెక్కలతో వస్తా.. మదిర, ఖమ్మం, సెక్రటేరియట్, ప్రగతి భవన్ ఎక్కడికి రమ్మన్నా సరే.. బహిరంగ చర్చకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రావాలె.. లేదంటే ప్రజలకు క్షమాపణలు చెప్పాలె.**
> **-హరీశ్‌రావు**

చమురుశుద్ధి కర్మాగారాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- **పార్లమెంటరీ స్థాయీసంఘం సమావేశంలో ఎంపీ వద్దిరాజు**

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): చమురుశుద్ధి కర్మాగారాల్లో మౌలికవసతులు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పష్టంచేశారు. సోమవారం ముంబై కొలాబాలోని తాజ్ కన్వెన్షన్‌లో జరిగిన పెట్రోలియం, సహజ వాయువుశాఖ పార్లమెంటరీ స్థాయీసంఘం సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సంఘం చైర్మన్ తట్కరే సునీల్ దత్తాత్రేయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. చమురుశుద్ధి కర్మాగారాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై స్థాయీసంఘం సమీక్షించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేండ్లుగా దేశవ్యాప్తంగా చమురుశుద్ధి కర్మాగారాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. పెట్రోల్, డీజిల్, సంబంధిత ఉత్పత్తులు, వంటగ్యాస్ ధరలు, రవాణా, మార్కెటింగ్, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, వినియోగదారుల అవసరాలపై సమీక్షించారు. సమావేశంలో స్థాయీసంఘం సభ్యులతోపాటు పెట్రోలియం, సహజ వాయువుశాఖ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్, ఓఎన్జీసీ సంస్థల ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం భోగి పర్వదినం పురస్కరించుకొని అధికారులు ఎంపీ రవిచంద్రను సత్కరించారు.

● పంట పొలాల్లో పిండి వంటలతో నిరసన

కాశీబుగ్గ, జనవరి 13 : వరంగల్ నగరంలోని 3వ డివిజన్ ఆరెపల్లిలో ఇన్నర్ రింగ్ రోడ్డులో వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులు సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో కాంగ్రెస్ నేతల వైఖరిని వ్యతిరేకిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి పంట పొల్లాల్లోనే పిండి వంటలు చేశారు. ఆరెపల్లి శివారు ఎన్ఎస్ఆర్ దవాఖాన నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) నిర్మాణానికి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) శ్రీకారం చుట్టింది. అధికార పార్టీలో పలుకుబడి ఉన్న నేతలు తమ భూముల విలువ పెరిగేలా తమకు అనుకూలంగా ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చేందుకు కీలకంగా వ్యవహరించారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో తమకు జీవనాధారంగా ఉన్న పంట భూములను కోల్పోతున్నామని కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. అధికారులు నేతల ఒత్తిళ్లతో అశాస్త్రీయంగా ఉన్న కొత్త అలైన్‌మెంట్ వైపు మొగ్గు చూపుతుండడంతో పలు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్నట్టు రైతులు పేర్కొంటున్నారు. కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసి వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలైన్‌మెంట్ మార్చొద్దని, పాత దానినే కొనసాగించాలంటూ పంట పొలాల్లో పిండి వంటలు చేస్తూ నిరసన తెలిపారు. ఇప్పటికైనా తమ భూములను ఐఆర్ఆర్ బారి నుంచి కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

సూర్యాపేట జిల్లా తమ్మర ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం గోదాముకు రైతులు వేసిన తాళాలు

ధాన్యం డబ్బులు ఇవ్వలేదని 'పీఏసీఎస్'కు తాళం

- **నెల రోజులైనా నగదు జమ కాకపోవడంతో రైతుల ఆగ్రహం**
- **సూర్యాపేట జిల్లా తమ్మెరలో ఘటన**

కోదాడ రూరల్, జనవరి 13: ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులు డబ్బులు నెల రోజులు గడుస్తున్నా రాకపోవడంతో పీఏసీఎస్ గోదాముకు తాళం వేసి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేట జిల్లా కోదాడ పరిధిలోని తమ్మర గ్రామానికి చెందిన ఎనిమిది మంది రైతులు కోదాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఐకేపీ సెంటర్‌లో 631 బస్తాల ధాన్యం విక్రయించారు. ధాన్యం అమ్మి నెల రోజులైనా తమ ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో సోమవారం తమ్మర లోని కోదాడ పీఏసీఎస్ గోదాముకు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల క్రితం ఐకేపీ సెంటర్ల ద్వారా కొనుగోలు చేసిన తమ ధాన్యం ప్రభుత్వానికి చేరిందా, లేక సొసైటీ వాళ్లు బయట అమ్ముకున్నారా అనేది తెలియడం లేదని చెప్పారు. సన్న వడ్లు అమ్ముకున్న మరికొంత మంది రైతులకు బోనస్ పడలేదని తెలిపారు. అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు సమయంలో సిబ్బంది ట్యాబ్‌లో నమోదు చేసే క్రమంలో జరిగిన తప్పిదంతో రైతులకు నగదు జమ కాలేదని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పండుగ సెలవుల అనంతరం సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు.

● ఎరువుల కోసం 'ఆధార్' లైన్

ఎల్లారెడ్డిపేట, జనవరి 13 : ఎరువుల కోసం రైతులు తిప్పలు పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన కష్టాలు మళ్లీ పునరావృతమవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలోని గ్రామ పంచాయతీలో ఒక రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇవ్వాలని నిబంధన పెట్టడంతో రైతులు సోమవారం ఉదయమే వచ్చి ఎరువుల బస్తాల కోసం క్యూలైన్లో నిలబడ్డారు. కొద్దిసేపటికి ఆధార్ కార్డులు కావాలని గ్రామ పంచాయతీ సిబ్బంది అడగడంతో వాటిని వరుసలో పెట్టి టోకెన్లు తీసుకున్నారు. 350 ఇండ్లు, 600 ఎకరాలు 163 మంది రైతులున్న ఈ చిన్న గ్రామంలో గత పదేండ్లలో ఎప్పుడూ ఎరువుల కోసం క్యూలైన్లు కట్టలేదని, ఇప్పుడు మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన కష్టాలు గుర్తుకు వస్తున్నాయని రైతులు వాపోయారు. బీఆర్ఎస్ హయాంలో లేని ఇబ్బందులు ఇప్పుడెందుకని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.

బీఆర్ఎస్ కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ భూస్థాపితం

- **మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హెచ్చరిక**

భువనగిరి అర్బన్, జనవరి 13 : బీఆర్ఎస్ కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ భూస్థాపితం అవుతుందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హెచ్చరించారు. భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలపై గానీ, ప్రతిపక్షనాయకులపై గానీ పోలీసులు అత్యుత్సాహం చూపించలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భూ దందా, కబ్జాలే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ నిరసన తెలిపేందుకు వస్తుంటే పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్బంధ కాండ సాగిస్తే ప్రతి చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పంటలకు బోనస్ ఏదీ?

- **పది పంటలకు బోనస్ ఇస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల హామీ**
- **ఇప్పుడు సన్నాలకు పరిమితం**
- **మిగిలిన రైతులను పట్టించుకోని సర్కార్**
- **బోనస్ దక్కక తీవ్రంగా నష్టపోతున్న రైతులు**

హైదరాబాద్, జనవరి 13(నమస్తే తెలంగాణ): మద్దతు ధరకు అదనంగా బోనస్ ఇచ్చి పంటలు కొనుగోలు చేస్తామనేది కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ. మ్యానిఫెస్టోలోనూ ఏ పంటకు ఎంత బోనస్ ఇస్తామో తెలియజేస్తూ పట్టిక ప్రచురించింది. కానీ, అధికారంలోకి వచ్చాక బోనస్‌ను అటకెక్కించింది. బోనస్ ఇవ్వకుండానే పలు పంటలను కొనుగోలు చేస్తున్నది. సర్కారు తీరుతో రైతులు భారీగా నష్టపోతున్నారు. తాము అధికారంలోకి వస్తే పది పంటలకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. చివరకు ఒకే ఒక్క పంటకు పరిమితం చేసింది. అది కూడా కొర్రీలతో. వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్.. ప్రస్తుతం సన్న ధాన్యానికి మాత్రమే ఇస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పలు పంటల ధర పడిపోయింది. దీంతో మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీగా కేంద్ర ప్రభుత్వం సోయాబీన్, పత్తి, కందులు, మొక్కజొన్న, జొన్న పంటలను మద్దతు ధరలకు కొనుగోలు చేసింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చూస్తూ ఉండటం గమనార్హం. కేంద్రం మద్దతు ధరకు పంటలు కొనుగోలు చేస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన బాధ్యతగా ఇచ్చిన హామీ మేరకు ఆ పంటలకు బోనస్‌ను అదనంగా రైతులకు చెల్లించాలి. కానీ, రైతులకు మద్దతు ధర ఇవ్వడమే ఎక్కువ అన్నట్టుగా వ్యవహరిస్తున్నది.

కాంగ్రెస్ బోనస్ హామీ ఇచ్చిన పంటలు
(క్వింటాల్‌కు రూపాయల్లో)

పంట రకం	మద్దతు ధర	బోనస్	మొత్తం
వరి ధాన్యం	2,320	500	2,820
మొక్కజొన్న	2,225	330	2,555
కందులు	7,550	400	7,950
సోయాబీన్	4,892	450	5,342
పత్తి	7,521	475	7,996
జొన్న	3,371	292	3,663
పసుపు	-	-	12,000
ఎర్రజొన్న	-	-	3,500
చెరుకు	-	-	4,000
మిర్చి	-	-	15,000

కేసీఆర్‌ను విమర్శిస్తే పుట్టగతులుండవు

- **బీఆర్ఎస్ నేత కరాటే రాజునాయక్ ఆగ్రహం**

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): గిరిజనుల అభివృద్ధి ప్రదాత కేసీఆర్‌ను విమర్శించే హక్కు సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ రవీందర్‌నాయక్‌కు లేదని బీఆర్ఎస్ నాయకుడు కరాటే రాజునాయక్ మండిపడ్డారు. కేసీఆర్ అవకాశం ఇవ్వకుంటే రవీందర్‌నాయక్ వార్డ్ మెంబర్‌గా కూడా గెలిచేవాడు కాదని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి వత్తాసు పలుకుతూ కేసీఆర్‌పై రవీందర్‌నాయక్ విమర్శలు చేయడం దారుణమని, పూటకో పార్టీ మారుస్తున్న రవీందర్‌నాయక్‌ను చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను విమర్శిస్తే పుట్టగతులుండవని హెచ్చరించారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం, సేవాలాల్ జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించడం, బంజారాభవన్ నిర్మాణం, గిరిజన గురుకులాలు ఏర్పాటు, పోడుభూములకు పట్టాల పంపిణీ కేసీఆర్ వల్లే సాధ్యమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్లలో గిరిజనుల భూములు లాక్కుంటున్నప్పుడు రవీందర్‌నాయక్ ఎక్కడున్నాడని రాజునాయక్ ప్రశ్నించారు.

ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై బైఠాయించిన మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ నాయకులు, రైతులు

రుణమాఫీ చేయలే.. భరోసా ఇయ్యలే

- **రైతుల జీవితాలు.. తెగిన గాలిపటాలు**
- **సర్కార్ తీరుపై జోగు రామన్న ఫైర్**
- **ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ వినూత్న నిరసన**

ఆదిలాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో రైతుల జీవితాలు తెగిన గాలిపటాలుగా మారాయని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు వినూత్నంగా నిరసన చేపట్టారు. విశ్రాంతి భవనం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఆందోళకు దిగిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. అన్నదాతలు రైతుభరోసా అందక, రుణమాఫీ కాక, ఎరువులు దక్కక ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలు ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామనడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పత్తి కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సీసీఐ మద్దతు ధరలో రూ.100 తగ్గించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేసేంత వరకు వెంటాడుతామని హెచ్చరించారు. పోలీసు కేసులకు భయపడేది లేదని, రైతుల కోసం జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు.

66.33 కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల

- **శంకుస్థాపన చేసిన భట్టి**

ఖమ్మం/మామిళ్లగూడెం, జనవరి 13 : ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం కాలువ నిర్మాణ పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రూ.66.33 కోట్లతో నిర్మించనున్న ఎత్తిపోతలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం ఖమ్మం కలెక్టరేట్‌లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు తదితర పథకాలపై ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 నుంచి అమలుచేయనున్న ఈ నాలుగు పథకాలకు రూ.45 వేల కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్టు భట్టి తెలిపారు.